కోట బోనాలకు రండి

గోల్కొండ: గురువారం ప్రారంభం కానున్న గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరుకావాలని కోరుతూ సబ్బిమండీ గంగపుత్ర సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రం అందజేశారు. పూజా కమిటీ అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్, సలహాదారులు బాలనర్సింహ, హేమంత్, పి.చంద్రకాంత్, జగ్జీవన్, మధుకిరణ్ తదితరులు ఉన్నారు.

లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ చైర్మన్‌కు..

కోట బోనాల సందర్భంగా గురువారం గోల్కొండ రిసాలబజార్ నుంచి నిర్వహించనున్న జులూస్‌కు హాజరుకావాలని కోరుతూ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ చైర్మన్ మారుతీయాదవ్‌కు బుధవారం ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు మహేశ్, జ్ఞానేశ్వర్, బి.శ్రీకాంత్‌చారి తదితరులు ఉన్నారు.

బోనాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలి శ్రీఅక్కన్న మాదన్న మహంకాళి ఆలయ 77వ వార్షిక బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి నగరంలోని ఆమె నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ఆర్.ప్రభాకర్, ప్రతినిధులు జగన్‌మోహన్‌కపూర్, ఎస్.పి క్రాంతికుమార్, ఎం. కృష్ణ, జి. రాఘవేందర్, జి. శ్రీనివాస్, సాయికిరాణ్, పి.విశాల్ పాల్గొన్నారు.

బోనాలకు మరిన్ని నిధులు మంజూరు చేయాలి

చార్మినార్: బోనాల సందర్భంగా పాతబస్తీలోని ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరిన్ని నిధులు కేటాయించాలని మజ్లిస్ ఓబీసీ ఇన్‌చార్జి ఆర్.దీపేష్ రాజ్ వర్మ కోరారు. ఈమేరకు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ లెటర్‌ను బుధవారం మంత్రి కొండా సురేఖకు అందజేశారు. పాతబస్తీలోని అన్ని ఆలయాల నిర్వాహకులకు దేవాదాయ శాఖ తరఫున అవసరమైన మేర ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



పింజరోళ్ల సత్యనారాయణ

చార్మినార్: డబీర్‌పురాలోని పంచదుర్గ ఆలయ కమిటీ సభ్యులు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పింజర్ల సత్యనారాయణను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతేడాది లాగే ఈయేడు కూడా మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలను 2 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈనెల 28న డబీర్‌పురా పంచదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తుల్జాపూర్‌కు బయలుదేరి వెళ్తామని తెలిపారు. 29న వైభవంగా బోనాలు నిర్వహిస్తామని తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



అబిడ్స్: అంబ గార్డెన్‌లోని నల్లపోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అభిషేకం, అర్చనలతో పాటు లలిత సహస్రనామ పూజలు ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా నాగేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే గోశాలల ఏర్పాటు



అబిడ్స్: రాష్ట్రవ్యాప్తంగా అధునాతన గోశాలలు ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మణిలాల్‌షా పేర్కొన్నారు. బేగంబజార్ గోశాలలో బుధవారం అమావాస్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రేమలత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



కోటలో కొలువుదీరిన అమ్మవారు

నేటి నుంచే కోట బోనాలు

- జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం
- 9 వారాలు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- కోట మెట్లకు బొట్లు పెట్టిన భక్తులు

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢమాసం బోనాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారికి మొత్తం 9 వారాల పాటు పూజలు నిర్వహించనున్నారు. మొదటి పూజకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారు ప్రత్యేకంగా అలంకరించిన దేవతా విగ్రహాల వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. జానపద కళాకారులు ప్రత్యేకంగా పాటలు పాడుతూ భక్తులను ఉత్సాహపరుస్తారు. గోల్కొండ ప్రధాన రహదారి నుంచి తొట్టెల ఊరేగింపు వైభవంగా ప్రారంభమవుతుంది. కోటలోని జగదాంభిక, మహంకాళి అమ్మవార్ల దర్శనానికి మొదటి బోనం రోజున వేలాధిగా భక్తులు తరలిరానున్నారు. వీరికి దారి పొడవునా దేవాదాయ శాఖ వారు స్వాగత వేదిక ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకునే పోతరాజుల విన్యాసాలు..

బోనాల్లో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. వారి విన్యాసాలు చూసేందుకు అన్ని వర్గాల ప్రజలు రోడ్డుకిరువైపులా బారులు తీరి వీక్షిస్తుంటారు. ఓవైపు పోతరాజుల గింకారాలు, కొరడా చప్పుళ్లు మరోవైపు శివసత్తుల పునకాలతో మొత్తం ఆధ్యాత్మికత వాతావరణం సంతరించుకోనున్నాది.



కోట గోడలకు బొట్లు పెడుతున్న మహిళలు

మెట్టు మెట్టుకు బొట్టు..

బుధవారం అమావాస్యను పురస్కరించుకుని కోట మెయిన్ గేటు నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే మెట్లను మహిళలు బొట్టు పెట్టి అలంకరించారు. నగరం నలుమూలల నుంచి మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో మెట్లతో పాటు మెట్లను ఆనుకుని ఉన్న కోట గోడలకు సైతం బొట్లు పెట్టి అలంకరించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, కుల్సుంపురా ఏసీపీ మునావర్ తదితరులు

జియాగూడ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మునావర్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జియాగూడ విద్యశ్రీ హైస్కూల్‌లో స్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా, ప్రిన్సిపాల్ సునీత శ్యామ్ వెరాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థుల ప్లకార్డుల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది మాదక ద్రవ్యాల బారిన పడి విలువైన జీవితం కోల్పోవడమే కాకుండా మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ డీఐ.వరప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బజార్‌ఘాట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నాంపల్లి: బజార్‌ఘాట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హబీబ్‌నగర్ పోలీసులు డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై డ్రగ్స్ వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న విజయ్ శ్రీనివాస్

వీటి వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారి ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, ఎస్సై సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.పుల్లారెడ్డి కళాశాలలో..

గోల్కొండ: మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్ రవాణ, వినియోగం తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మహ్మద్ మునావర్, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజుతో పాటు జి.పుల్లారెడ్డి డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు గోల్కొండ అమ్మవారికి తొలి బంగారు బోనం

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో గురువారం మొదటి బోనంను గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని ఈనెల 29న విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి సమర్పించనున్నారు. పోతురాజుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలతో సామూహిక ఊరేగింపుగా బయలుదేరి బంగారు బోనాన్ని సమర్పించనున్నారు. ముందుగా అక్కన్న మాదన్న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోల్కొండకు బయలుదేరి వెళ్లనున్నట్లు ఊరేగింపు కమిటీ చైర్మన్ తెలిపారు. జోగిని నిషా క్రాంతి బంగారు పాత్రలోని నైవేద్యాన్ని తలపై పెట్టుకుని దారిపొడవునా నృత్యాలు చేస్తూ భక్తులను అలరించనున్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న బృందం

పలువురు మంత్రులకు ఆహ్వానం

గోల్కొండ జగదాంభిక అమ్మవారికి తొలి బంగారు బోనం సమర్పించనున్న నేపథ్యంలో హాజరుకావాలని కోరుతూ ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపీశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్హతతో పాటు 18- 30 ఏళ్ల లోపు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు గురువారం విజయనగర్ కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావలని, మరిన్ని వివరాలకు 8977175394, 9063099306 నంబర్లలో సంప్రదించాలి ఆమె సూచించారు.

మహా రుద్రాభిషేకం ..

జియాగూడ: లక్ష్మీనర్సింహానగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ఈనెల 26న ఉదయం 8 గంటలకు శివాలయంలో మహా రుద్రాభిషేకం, బంగారు మైసమ్మ ఆలయంలో మహా రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అనంతరం మాతేశ్వరీకి ప్రత్యేక అలంకరణ, అఖండ హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

అబిడ్స్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్‌ను గ్రేడ్-2 నుంచి సెక్రెటరీ గ్రేడ్-1 గా ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సెక్రటరీ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో రైతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సెక్రటరీ మాట్లాడుతూ.. రైతులు, వ్యాపారులు ఉద్యోగుల సహకారంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు శ్వేత, మహేశ్, రవి, ఆంజనేయులుతో పాటు పలువురు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన సెక్రెటరీ శ్రీనివాస్‌ను సత్కరించిన చైర్మన్ మల్లేశ్ ముదిరాజ్

వ్యక్తి అదృశ్యం



బి.ప్రవీణ్

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఏఎస్సై రంగనాయకులు తెలిపిన వివరాల ప్రకారం .. సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన బి.ప్రవీణ్ (38) ఈనెల 23న మధ్యాహ్నం 12 గంటలకు కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన సోదరుడు ప్రశాంత్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఆచూకీ లభించలేదు. దీంతో మొఘల్‌పురా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. గతంలోనూ ఇదే మాదిరిగా బయటికి వెళ్లి 18 రోజుల అనంతరం వచ్చాడని ఈసారి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మానియాలో బొల్లి వ్యాధిపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో వైద్య విద్యార్థినులు

అఫ్జల్‌గంజ్: ప్రపంచ బొల్లి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలోని చర్మవ్యాధుల విభాగాధిపతి డాక్టర్ కె.భూమేశ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఓపీ భవన్ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ తీశారు. బీఎస్సీ, జనరల్ నర్సింగ్ విద్యార్థినులు బొల్లి మచ్చల వ్యాధి అని సుఖ వ్యాధి కాదని, కరచలనం, సామూహిక మరుగుదొడ్లను వాడడం ద్వారా వ్యాపించదని నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. తెల్లమచ్చల కారణంగా కుటుంబ సభ్యులు, ఇతరులు అంటువ్యాధి అని దూరం పెట్టడం వల్ల ఆత్మన్యూనత, మానసిక క్షోభ అనుభవిస్తున్నారని, ప్రాథమిక దశలోనే గుర్తించి నిష్ణాతులైన చర్మ వ్యాధుల నిపుణులతో చికిత్స పొందాలని డాక్టర్ భూమేశ్‌కుమార్ సూచించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా, వాసవీ అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య గుప్తా, బీపీ శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి పడకండి వెంకటేశం గుప్తా, అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల భిక్షపతి గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్క శేఖర్, సభ్యులు వేముల నాగరాజు, సాంబశివ రావు పాల్గొన్నారు.

బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో ..

సుల్తాన్‌బజార్: అమావాస్య ప్రత్యేక పూజలను పురస్కరించుకుని బుధవారం బజరంగ్ సేనా ఆధ్వర్యంలో కోఠిలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదం వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్, రాఘవ, రవి, సాయి, శేఖర్, నరేశ్, చోటు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యల్లేకుండా చూడాలి

యాకుత్‌పురా: బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యల్లేకుండా చూడాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. తలాబ్ చంచలం డివిజన్‌లోని భవానీనగర్, తలాబ్‌కట్టా రైల్వే ట్రాక్, సిద్దిఖీనగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగంతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

ఆయన వెంట మజ్లిస్ ఏరియా కమిటీల అధ్యక్షులు, నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ తెలిపారు. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కార వారోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆసుపత్రి, దంత వైద్య కళాశాల, పేట్లబుర్జులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, సిటీ కళాశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించి 58 సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నగర శివారుల్లో గుర్తించిన భూముల వివరాలు, నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హౌసింగ్ సొసైటీ ఏర్పాటు విషయాలను ఉద్యోగులతో చర్చించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రంకుమార్, కార్యదర్శి కె.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, సభ్యులు ఖాలేద్ అహ్మద్, ఏవి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితరులు

కులం పేరిట దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



చాంద్రాయణగుట్ట: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఇప్ప జనార్దన్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను నివాసం ఉండే జంగమ్మెట్ ప్రాంతానికే చెందిన జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి అంకర్ల సుమన్ తనను నమ్మించి చెత్త తరలింపు వాహనాలు ఇప్పిస్తానంటూ 2021 సంవత్సరంలో రూ.48 లక్షలు వసూలు చేశాడన్నారు. వాహనాలు ఇప్పించకపోవడంతో అడిగేందుకు వెళ్లిన తనను ఈనెల 8న కులం పేరుతో అసభ్యకరంగా దూషించడంతో ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారన్నారు. అయినప్పటికీ పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే అరెస్ట్ చేయాలని లేకుంటే దళిత సంఘాలతో కలిసి ఫలక్‌నుమా ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తి అరెస్టు

- రూ.11.25 లక్షల విలువైన 45 కేజీల ఎండు గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంతోష్‌నగర్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్

సంతోష్‌నగర్: గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని ఐ.ఎస్.సదన్ పోలీసులు అరెస్ట్ చేసి రూ.11.25 లక్షల విలువైన 45 కేజీల ఎండు గంజాయి, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంతోష్‌నగర్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్ ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు, డి.సైదయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. యాదగిరిగుట్ట పెద్ద కందుకూర్ ప్రాంతానికి చెందిన జనపాల హరికృష్ణ అలియాస్ హరికిషన్ (28) సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేసి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో మహబూబాబాద్ జిల్లా అంబేద్కర్ కాలనీకి చెందిన స్నేహితుడు, గంజాయి వ్యాపారి తునం అరవింద్‌ను కలిశాడు. గంజాయి రవాణా చేస్తే పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించవచ్చని అరవింద్ హరికిషన్‌కు సూచించాడు. దీంతో హరికిషన్ తన కారులో మహబూబాబాద్‌లోని అరవింద్‌కు వద్దకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి ఒడిస్సాలోని కలిమెలకు వెళ్లి శరత్ కుమార్ సాహును కలిసి 45 కేజీల ఎండు గంజాయిని కొనుగోలు చేసి మహబూబాబాద్‌కు తీసుకువచ్చారు. కొనుగోలుదారుల కోసం రెండు రోజులు వేచి ఉన్నా ఎవరూ రాలేదు. దీంతో పెద్ద కందుకూర్‌లోని తన ఇంట్లో ఉంచాలని అరవింద్ హరికిషన్‌కు సూచించాడు. కాగా బుధవారం అరవింద్ హరికిషన్‌కు నగరంలోని మంగళ్‌హట్ ప్రాంతంలో గంజాయి అమ్మకానికి రవాణా చేయాలని సూచించాడు. దీంతో హరికిషన్ కారులో ప్రత్యామ్నాయ మార్గాల్లో గంజాయిని తరలిస్తుండగా ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడగా అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఒడిస్సాకు చెందిన శరత్ కుమార్ సాహు, తునం అరవింద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సంతోష్‌నగర్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్